## క్లుప్తంగా

### నేడు రేణికుంటకు 'ఉత్తమ్'

తిమ్మాపూర్: మండలంలోని రేణికుంటలో బుధవారం నిర్వహించే గ్రామసభకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హాజరవుతారని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఉదయం పది గంటలకు గ్రామ సభ ప్రారంభమవుతుందన్నారు.

### కరపత్రాల ఆవిష్కరణ

జమ్మికుంట: ఇంటర్, డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు 2025–26 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ డిగ్రీ ,పీజీ కళాశాలలో చేరాలని కళాశాల ప్రిన్సిపల్ రమేశ్ దోస్తు కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కళాశాలలో అన్నిరకాల వసతులు, సకల సౌకర్యాలున్నాయని, అధ్యాపకులు ఉత్తమ బోధన అందిస్తారని, ప్రభుత్వ కాలేజీలోనే చేరాలని జూనియర్ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఓదేలు కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్ రాజేంద్రం, అధ్యాపకులు గణేశ్, మాధవి, శ్యామల, ఉమా కిరణ్, రాజాకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

### దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

గన్నేరువరం: ఎంపీ రాహుల్‌గాంధీపై అక్రమ కేసులు పెట్టినందుకు నిరసనగా మంగళవారం యూత్ కాంగ్రెస్ నాయకులు గన్నేరువరంలో బీజేపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ ప్రభుత్వం కావాలనే కేసులు పెట్టిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్, ఉపాధ్యక్షుడు సిద్ధార్థ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు వంశీకృష్ణారెడ్డి, నవీన్, గన్నేరువరం, తిమ్మాపూర్, మాకొండూర్, శంకరపట్నం మండల అధ్యక్షులు నవీన్, సురేశ్, మణికంఠ, అజయ్, ఉపాధ్యక్షులు అజయ్, కుమార్, మండల కార్యదర్శి జయప్రకాష్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు అనిల్, ఎస్సీ ఎల్ టౌన్ ప్రెసిడెంట్ నరేష్, నాయకులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ


నూతన కమిటీ సభ్యులు

చిగురుమామిడి: నవాబుపేట ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి ఏడెల్లి సంపత్ తెలిపారు. సోమవారం రాత్రి జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా బోయిని సతీశ్, ఉపాధ్యక్షుడిగా ఉమేశ్, మట్టేల బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎనగందుల గణేశ్, కార్యదర్శిగా రఘు, సహాయకార్యదర్శిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా మరో ఎనిమిది మంది ఎన్నికయ్యారని, ఇతర అనుబంధ కమిటీలను నియమించామన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్ష డప్పులు, వేల గొంతుకల మహాసభకు భారీగా తరలిరావాలని సంపత్ పిలుపునిచ్చారు.

### పరీక్ష ప్యాడ్లు పంపిణీ

వీణవంక: మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన జున్నూతుల కౌసల్య స్మారకార్థం మంగళవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘన్ముక్కుల మోడల్, హై స్కూల్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జున్నూతుల నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ మోహిజ్ భేగ్, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్ ఉన్నారు.

### ఉత్సవ విగ్రహాల అందజేత

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీరామాంజనేయ దేవాలయానికి అదే గ్రామానికి చెందిన కల్లెపు సంపత్‌రెడ్డి ఉత్సవ విగ్రహాలను బహూకరించగా మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి మంగళవారం అందించారు. ఈ సందర్భంగా సంపత్‌రెడ్డి కుటుంబ సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న, ఆర్య వైశ్య రాష్ట్ర నాయకులు పల్లెర్ల కిరణ్, మాజీ సర్పంచ్ మేకల శ్రీనివాస్‌రెడ్డి, నిమ్మల సమ్మయ్య, గంధం సుమన్, బండారి అనిల్ ఉన్నారు.

### కాంగ్రెస్ నుంచి సస్పెండ్

గన్నేరువరం: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు క్రమశిక్షణ చర్యలు కింద గన్నేరువరంకు చెందిన బుర్ర మల్లయ్యగౌడ్‌ను సస్పెండ్ చేశామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

### 'అహంకారంతోనే మాజీ ఎమ్మెల్యేపై ఆరోపణలు'

తిమ్మాపూర్: అహంకారంతో కాంగ్రెస్ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు వంతడుపుల సంపత్, పాశం అశోక్ రెడ్డి అన్నారు. తిమ్మాపూర్‌లో మంగళవారం మాట్లాడారు. ఎమ్మెల్యే, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్‌గా పనిచేసిన ఉద్యమకారుడిని విమర్శించే అర్హత, స్థాయి రమణారెడ్డికి లేదన్నారు.


సైదాపూర్: బొమ్మకల్ గ్రామసభలో ఏసీపీ శ్రీనివాస్‌జీ


హుజూరాబాద్: సింగాపూర్‌లో అధికారులను నిలదీస్తున్న మహిళలు

# అధికారుల నిలదీత.. రసాభాస

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో మంగళవారం నిర్వహించిన గ్రామ, వార్డు సభలు రసాభాసగా సాగాయి. అధికారులు దరఖాస్తుదారుల వివరాలను చదివి వినిపించారు. అక్కడక్కడ అధికారులను నిలదీశారు. ఆరుగ్యారంటీలకు దరఖాస్తు చేసుకుంటే జాబితాలో పేరు రాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హత లేని వారి పేర్లు జాబితాలో వచ్చాయని కొందరు అధికారులతో వాగ్వాదానికి దిగడంతో గందరగోళం నెలకొంది. పేరురానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధి కారులు సూచించారు. కొన్నిచోట్ల మాత్రమే గ్రామసభలు ప్రశాంతంగా సాగాయి. మొదటి రోజు పథకాలకు సంబంధించి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు.


చిగురుమామిడి: మాట్లాడుతున్న తిరుపతిరెడ్డి


శంకరపట్నం: కరీంపేటలో జాబితాలో పేరు లేదని అధికారులతో వాగ్వాదం


ఇల్లందకుంట: బూజునూరులో ఎంపీడీవోను నిలదీస్తున్న మహిళ

# మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు


హుజూరాబాద్: డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వేణు, తదితరులు

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో మంగళవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలపై కేశవపట్నం ఎస్సై రవి అవగాహన కల్పించారు. ఆటోడ్రైవర్లు, యువకులకు ట్రాఫిక్‌రూల్స్ వివరించారు. ద్విచక్రవాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. ట్రిపుల్, ర్యాష్‌డ్రైవింగ్ చేయొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్సై స్వాతి, సిబ్బంది ఉన్నారు.

**మత్తు పదార్థాలతో అనర్థాలు**

మత్తుపదార్థాలు– అనార్థాలపై ఎక్సైజ్ ఎస్సై వినోద్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండలంలోని కేశవపట్నం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసై బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని, ఉన్నత మార్గంలో నడవాలని సూచించారు.

**స్కూల్ బస్సులు నెమ్మదిగా నడపాలి**

హుజూరాబాద్: స్కూల్ వ్యాన్‌లను నెమ్మదిగా నడపాలని హుజూరాబాద్ ఎంవీఐ కంచి వేణు అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. అనంతరం డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రహదారి భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలు జరగవని స్పష్టం చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని, బస్సు కండిషన్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖ సిబ్బంది ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డు గుర్రం శ్రీకాంత్‌గౌడ్, ట్రస్మా నాయకులు వెంకన్న, కరస్పాండెంట్లు ఉన్నారు.


లింగాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్సై రవి

# భారత రాజ్యాంగం ప్రపంచానికి దిక్సూచి

హుజూరాబాద్: 75వ భారత రాజ్యాంగ దినోత్సవాలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన అభియాన్ సన్నాక సమావేశంలో మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపిందని, భారత రాజ్యాంగం ప్రపంచానికి దిక్సూచిగా మారిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, కోఆర్డినేటర్లు కొలిపాక శ్రీనివాస్ బోరగల సారయ్య కొమరవెల్లి సంతోష్. కౌన్సిలర్ పైల వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు గంగిశెట్టి రాజు, నరాల రాజశేఖర్, తిప్పబత్తిని రాజు, యంసాని శశిధర్, తూముల శ్రీనివాస్, యాళ్ల సంజీవరెడ్డి, అంకటి వాసు, గంట సంపత్, మోతే తిరుపతి, కొలిపాక వెంకటేష్, తాళ్లపల్లి హరీష్ తదితరులు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న రాజు, నాయకులు

# అర్హులకే సంక్షేమ ఫలాలు

మానకొండూర్/మానకొండూర్‌రూరల్: అర్హులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందుతాయని ఎంపీడీవో వరలక్ష్మి అన్నారు. వివిధ గ్రామాలలో నిర్వహించిన గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. కొంత మంది అర్హులు జాబితాలో పేర్లు రాలేదని అధికారులకు మొరపెట్టుకున్నారు. గట్టుదుద్దెనపల్లి, చెంజర్లలో తహసీల్దార్ రాజేశ్వరీ మాట్లాడారు. రేషన్ కార్డుల పక్రియ నిరంతర పక్రియ అన్నారు.

హుజూరాబాద్: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ కనకయ్యకు చెల్పూర్ గ్రామస్తులు వినతి పత్రం సమర్పించారు. లబ్ధిదారుల ఎంపిక, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. పలు వార్డు సభల్లో పాల్గొని మాట్లాడారు.


దరఖాస్తులు స్వీకరిస్తున్న గందె రాధిక, తదితరులు

**కేసు నమోదు**

జమ్మికుంట: బైక్‌తో ఢీ కొట్టిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన సామ రాజేందర్, తల్లి, పదేళ్ల బాలుడితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. బిజిగిరిషరీఫ్ జీపీ వద్ద భూపాలపల్లి జిల్లాకు చెందిన మహమ్మద్ అబ్దుల్ బైక్‌తో ఢీకొట్టాడు. ముగ్గురికి గాయాలు కాగా జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజేందర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ**

మానకొండూర్: రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని దేవంపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాం, సంఘం సమావేశ మందిర భవనాలను మంగళవారం ప్రారంభించారు. గ్రామంలోని రుణమాఫీ లబ్ధిదారుల వివరాలను వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన సహకార వ్యవస్థను పటిష్టపర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సంఘం పరిధిలోని పచ్చునూరులో గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లతాప్రభాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, నాయకులు వరాల చారి, శ్యామ్ పాల్గొన్నారు.

గన్నేరువరం: ప్రభుత్వం అర్హులకే సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని చొక్కారావుపల్లెలో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పక్రియ పారదర్శకంగా జరగాలనే గ్రామసభలను నిర్వహించడం జరుగుతోందన్నారు. పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మండల ప్రత్యేకాధికారి రామానుజచార్యులు, ఇన్‌చార్జీ ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ముస్కు కరుణాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

# నిర్మించినా నిరుపయోగం

- వ్యాపారం ఒకచోట... భవనాలు మరోచోట
- ప్రారంభానికి నోచుకోని ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవనం
- రూ. కోట్లతో నిర్మిస్తే కారు పార్కింగ్‌కు అడ్డాగా మారిన వైనం
- ఫుట్‌పాత్‌లకే పరిమితమైన చిరువ్యాపారులు
- వ్యాపారులను ఒక్కచోటుకి చేర్చడంలో పాలకులు విఫలం



ఖాళీగా దర్శనమిస్తున్న కూరగాయల మార్కెట్ భవనం


సూపర్‌బజార్ ఏరియాలో రోడ్డుపై విక్రయాలు


మిగులు పనులు పూర్తికాక ప్రారంభానికి నోచుకోని ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్

హుజూరాబాద్: చిరువ్యాపారుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున నిధులు కేటాయించి పట్టణంలో నిర్మించిన కూరగాయల మార్కెట్ భవనం నిరుపయోగంగా ఉంది. ఫుట్‌పాత్, తోపుడు బండ్లపై కూరగాయలు అమ్ముకునే వారు వ్యాపార సముదాయం ఏర్పాటు చేయాలని పాలకుల చుట్టూ తిరిగారు. అప్పటి మంత్రి ఈటల రాజేందర్ నేతృత్వంలో సుమారు రూ.కోటిన్నర నిధులతో సకల సదుపాయాలతో మార్కెట్ భవనం నిర్మించారు. తర్వాత అధికారులు డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసిన మార్కెట్ భవనంలో స్థలం కేటాయించారు. కానీ చిరువ్యాపారులు ఎవరూ అందులో కూరగాయలు విక్రయించడం లేదు. గిరాకీ రాకపోవడం, భవనం ప్రజలకు దూరంగా ఉండటంతో వ్యాపారులు అందులో కూరగాయలను విక్రయించేందుకు ఆసక్తి చూపక మళ్లీ రోడ్లపై అమ్మకాలు జరుపుతున్నారు. రూ.కోట్లతో నిర్మించిన భవనంలోకి వ్యాపారులను తీసుకురావడంలో అధికారులు విఫలమయ్యారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు.

**రద్దీ ప్రాంతాల్లో విక్రయాలు**

సూపర్‌బజార్ ఏరియా, హుజూరాబాద్–జమ్మికుంట రోడ్డును ఆనుకొని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా, మసీద్ పక్కన, మున్సిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు చిన్న టెంట్లు వేసుకొని కూరగాయలు విక్రయిస్తున్నారు. ప్రాంతాల్లో వాహనాల రద్దీ ఎక్కువ పైగా కూరగాయలు సైతం విక్రయిస్తుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. సంత జరిగే గురువారం రోజు అడుగు వేసి అడుగు తీయలేనంత పరిస్థితి. సైదాపూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆర్టీవో కార్యాలయాన్ని కూలగొట్టి సుమారు రూ.రెండున్నర కోట్ల వ్యయంతో నిర్మించిన వెజ్, నాన్‌వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన నిర్మాణం పూర్తయి సుమారు రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రారంభానికి నోచుకోవడం లేదు. వ్యాపార నిర్వహణ కోసం కావాలిన సదుపాయాల నిర్వహణ అందులో కల్పించాల్సి ఉంది. కానీ ప్రారంభానికి ఎందుకు ఆలస్యమవుతుందో అంటూ వ్యాపారస్తులు గుసగుసలాడుతున్నారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు క్లియర్ కాకపోవడం మూలంగానే ఆలస్యం జరుగుతోందని పట్టణంలో చర్చ జరుగుతుంది. రూ. కోట్లతో మార్కెట్ భవనం నిర్మిస్తే కార్లు, ద్విచక్రవాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. మార్కెట్ భవనం సమీపంలో నివాస గృహాల వారు భవనం ఖాళీగా ఉందని వాహనాలను ఎండ, వానను రక్షించుకునేందుకు పార్కింగ్ చేస్తున్నారు. అలాగే భవనంలో పలు గదులు చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. వ్యాపారం జోరుగా సాగే ప్రాంతాల్లో చిరు వ్యాపారులకు రేకుల షెడ్డు మాదిరిగా నిర్మిస్తే వ్యాపారానికి అడ్డంకి ఉండకపోగా, ప్రధానంగా ట్రాఫిక్ సమస్య తీరే అవకాశం ఉంది. సూపర్ బజార్ ఏరియాలో ప్రధాన షాపుల ఎదుట కూరగాయలు, పండ్ల విక్రయాలు జరుగుతుండటంతో నిత్యం చిరువ్యాపారులు, దుకాణదారులకు వాగ్వాదం జరుగుతోంది.

**కూరగాయలు పాడైపోతున్నాయి**


సూపర్ బజార్, సైదాపూర్ క్రాస్ రోడ్డు ఏరియాల్లో రద్దీ ఉంటుంది. ఈ ప్రాంతాల్లో చిరువ్యాపారుల కోసం రేకులషెడ్లు ఏర్పాటు చేయాలి. గిరాకీ జరిగే ప్రాంతానికి దూరంగా మార్కెట్ భవనం ఉండటంతో వినియోగదారులు రాక కూరగాయలు పాడైపోతన్నాయి.
– ఉడ్నాల అనంతస్వామి, కూరగాయల వ్యాపారి, హుజూరాబాద్

**గిరాకీ అంతంతే**


రద్దీగా ఉండే ప్రాంతాల్లో వ్యాపార సముదాయం లేకపోవడంతో గిరాకీ అంతంత మాత్రంగానే ఉంది. ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతంలో సముదాయముంటే ఉపాధితో బాధలు తీరుతాయి. జమ్మికుంట రోడ్డులో వ్యాపారుల కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేయాలి. – మాతంగి రమాదేవి, కూరగాయల వ్యాపారి, హుజూరాబాద్

**ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించాలి**


చిరువ్యాపారుల కోసం ప్రభుత్వం నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని అధికారులు ప్రారంభించాలి. భవనంలో అన్నిరకాల సదుపాయాలు ఉండేలా అధికారులు చొరవ తీసుకోవాలి. పొద్దంతా సంపాదించిన డబ్బు అద్దె భవనాలకే సరిపోతోంది.
– అనిల్, మటన్ సెంటర్ యాజమాని,హుజూరాబాద్

## నియామకం

జమ్మికుంట: కరీంనగర్ జిల్లా కళామండలి అధ్యక్షుడు ప్రభు ఆధ్వర్యంలో లక్ష డప్పులు,వేలగొంతుకల కళా ప్రదర్శనలో భాగంగా పట్టణంలో మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గ అధ్యక్షురాలిగా ఆకినపల్లి శిరీషను ఎంపిక చేశామన్నారు. 22న కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలో నిర్వహించే సమన్వయ సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగా హాజరవుతారని, ఎస్సీ వర్గీకరణ కోసం దండోరా మోగిందామని పిలుపునిచ్చారు. మేధావులు, కళాకారులు, కవులు, మాదిగ ఉపకులాల నాయకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని, హుజూరాబాద్ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రామంచ భరత్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర ఆదిత్య, నాయకులు వసంత్, బోయిన సమ్మయ్య, విజేందర్, అబాల శ్రీరామ్, ప్రవీణ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభు, తదితరులు

## ఎస్సారార్ కళాశాల అడ్మిషన్ల ప్రచారం

కరీంనగర్‌సిటీ: ఎస్ఆర్ఆర్ కళాశాలలో అడ్మిషన్ క్యాంపెనింగ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, టీజీసీజీటీఏ సెక్రటరీ డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం జంతుశాస్త్ర విభాగం, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ వారు జమ్మికుంట(వీవోసీ) జూనియర్ కళాశాలను డిగ్రీ అడ్మిషన్ల కోసం సందర్శించారు. జంతుశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ జ్యోతిలక్ష్మి, వృక్షశాస్త్ర అధిపతి డాక్టర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బడి మానేసిన విద్యార్థుల గుర్తింపు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్‌లో బడి మానేసిన ఇద్దరు విద్యార్థులను మంగళవారం గుర్తించారు. ఈనెల 10 నుంచి విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి మానేసిన పిల్లల గుర్తింపు సర్వేను ప్రారంభించారు. బొమ్మకల్ పంచాయతీ పరిధిలోని ప్రియదర్శినీకాలనీలో తండ్రి మృతిచెందడంతో చదువు మధ్యలో మానేసిన ఇద్దరు విద్యార్థులను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు మొత్తం 14 మంది విద్యార్థులను గుర్తించినట్లు సీఆర్‌పీ రవిచంద్ర తెలిపారు.

## సాంఘికశాస్త్ర ప్రతిభా పాటవ పరీక్ష

కరీంనగర్: తెలంగాణ రాష్ట్రస్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభాపాటవ పరీక్ష మంగళవారం హైదరాబాద్‌లోని ఎస్వీఎస్ ఫంక్షన్ హాల్ హయత్‌నగర్‌లో నిర్వహించారు. మానకొండూర్ టీజీఎంఎస్ పోచంపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎం.రిషిక మూడో స్థానంలో నిలిచింది. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేశ్ అభినందించి ప్రశంస పత్రం, మెమెంటో అందజేశారు. కరీంనగర్ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా సాంఘికశాస్త్ర ఫోరం అధ్యక్షుడు బి.తిరుపతి, ప్రధాన కార్యదర్శి ఎ.కుమారస్వామి, కోశాధికారి పుల్లూరి రవీందర్ అభినందించారు.

## బైక్ చక్రంలో చున్నీ చిక్కుకొని యువతికి గాయాలు

గన్నేరువరం: మండలంలోని కూనవానిపల్లె గ్రామం వద్ద మంగళవారం ప్రమాదవాత్తు జరిగిన ప్రమాదంలో యువతికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు... రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన ఏరవెల్లి పర్శరాం, కూతురు ప్రసన్న బైక్‌పై గన్నేరువరం మండలం మాదాపూర్ గ్రామానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా ప్రసన్న చున్నీ బైక్ వెనుక టైర్‌లో చిక్కుకొని కింద పడిపోయింది. వారిని చూసిన కానిస్టేబుల్ సాయిప్రేమ్ హెడ్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, కానిస్టేబుల్ సాయి అరవింద్‌కు సమాచారం ఇచ్చాడు. పోలీస్ వాహనంలో తండ్రి కూతురిని గన్నేరువరంలోని ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించి వారి స్వగ్రామానికి తీసుకెళ్లారు. కానిస్టేబుళ్లను తిమ్మాపూర్ సర్కిల్ సీఐ కర్రె స్వామి, ఎస్సై తాండ్ర నరేశ్ అభినందించారు.

## టీపీటీఎల్ఏ నామినేషన్లు

జమ్మికుంట: పట్టణంలో హుజూరాబాద్ డివిజన్ టీపీటీఎల్ఏ (తెలంగాణ ప్రైవేటు టీచర్, లెక్చరర్స్ అసోసియేషన్)ఎన్నికల నామినేషన్ ప్రారంభమైందని ఎన్నికల చీఫ్ అధికారి పి. సంపత్ రావు మంగళవారం తెలిపారు. 24న నామినేషన్ల ఉప సంహరణ, 26న లోటస్ ఫాండ్ స్కూల్‌లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మంగళవారం లెక్చరర్ వేముల జగన్ అధ్యక్ష పదవికి నామినేషన్ వేశారని వివరించారు. కార్యక్రమంలో ఎన్నికల కమిటీ ఇంచార్జి విజయ్, తదితరులు పాల్గొన్నారు.


నామినేషన్లు స్వీకరిస్తున్న సంపత్‌రావు,తదితరులు